క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు ఎంపిక

పామూరు: మండలంలోని బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి సత్తా చాటారు. పి.కేశవమోక్షిత నూజివీడు ట్రిపుల్ ఐటీకి, డి.దత్త నాగేంద్ర ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ బాలక్రిష్ణ శుక్రవారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కర్ర తరలిస్తున్న ముగ్గురిపై కేసు

హనుమంతునిపాడు: మండల పరిధి ఉమ్మనపల్లి పంచాయితీలోని ఇరిగేషన్ చెరువులోని చిల్ల కర్ర కొట్టి అక్రమమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.శివనాగరాజు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన కోదమల జక్రయ్య, కొదమల ప్రసాదు, గాలం రామాంజనేయులు చెరువులోని కర్రను కొట్టి అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తున్నాట్లు కనిగిరి ఇరిగేషన్ ఏఈ రామక్రిష్ణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితులతో పాటు ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేస్తున్నట్లు ఎస్సై శినాగరాజు తెలిపారు.

ముస్లిం నేత మృతి


జిలానీ బాషా (ఫైల్)

ఉలవపాడు: అనారోగ్యం కారణంగా ఉలవపాడు మండల ముస్లిం నాయకుడు షేక్ జిలానీ బాషా (55) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఉలవపాడు మేజర్ పంచాయితీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. పలువురు నేతలు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యుత్ సరఫరా అంతరాయం నేడు

కనిగిరి రూరల్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉండదని చెప్పారు.

కందుకూరు పట్టణంలో..


కందుకూరు: ప్రతి రెండో శనివారం నిర్వహించే సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతులు చేయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యహ్నం 1గంటల వరకు పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ టీవీ నరసింహం తెలిపారు.

లింగపాలెం పాఠశాల తనిఖీ


మాట్లాడుతున్న ఎంఈఓ మల్లికార్జున్‌రావు

వలేటివారిపాలెం: మండలంలోని లింగపాలెం ప్రాథమిక పాఠశాను ఎంఈఓ- 2 మల్లికార్జున్‌రావు శుక్రవారం అకస్మాత్తు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాల గురించి ఉపాధ్యాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాజరు పట్టిక పరిశీలించారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల భోజనంలో ఎటువంటి అవకతవకలు రాకుండా, మంచి పౌష్టికాహారాన్ని ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయుడు రంగనాథ్ పాల్గొన్నారు.

93 బేళ్ల తిరస్కరణ


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం శుక్రవారం జరిగిన వేలంలో 93 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, సాదువారిపాలెం, ఎం. నిడమానూరు గ్రామాలకు చెందిన రైతులు 1064 బేళ్లు వేలానికి తీసుకురాగా వాటిలో 971 కొనుగోళ్లు జరిగాయి. కాగా 93 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 365, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ. 317. 44 పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు హాజరైనట్లు నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రత్యేక అలంకారంలో జగదాంబదేవి

మార్కాపురం: ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో వారాహి అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా శ్రీ జగదాంబ దేవీ అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదాంబ అమ్మవారిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి పలు ప్రత్యేక పూజలు చేశారు. తమ కోర్కెలు తీర్చాలని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


లింగసముద్రం: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అబ్రహం లింకన్


వలేటివారిపాలెం: మాట్లాడుతున్న తహసీల్దార్, వ్యవసాయ అధికారి


కొండపి: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

పంట సాగు హక్కు పత్రాలతో రాయితీలు

కొండపి (సింగరాయకొండ): ప్రభుత్వం అందించే రాయితీలు, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వలన సంభవించే పంట నష్టం రాయితీను రైతులు, కౌలు రైతులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమర్ అధ్యక్షతన మండలంలోని వీఆర్‌ఓలు, వీఏఏలకు పంటసాగు హక్కు పత్రాల (సీసీఆర్‌సీ) పై అవగాహన కల్పించారు. తహసీల్దార్ బి.కిరణ్, మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమర్ అధ్యక్షతన ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు కౌలు కార్డులు మంజూరు చేయాలన్నారు. కౌలుకు భూములు ఇచ్చే రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీసీఆర్‌సీ కార్డుల పరిమితి కేవలం 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. కౌలు రైతుకు కేవలం పంటపైనే, భూమి మీద హక్కు ఉండదన్నారు. భూ యజమానులకు ఎటువంటి అపోహాలున్న ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి రైతులు, కౌలు కౌలు సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. అదే విధంగా భూమిని కౌలుకు తీసుకునే రైతులు భూ యజమాని ఆధార్ కార్డు, కౌలుకు తీసుకునే రైతు ఆధార్ కార్డుతో పాటు ఫాం-1 తీసుకొని అంగీకార పత్రాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, వీఆర్‌ఓలు, వీఏఏలు పాల్గొన్నారు.


పీసీపల్లి: మాట్లాడుతూ తహసీల్దార్ పద్మావతి


వెలిగండ్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ డానియేల్

వలేటివారిపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామాల రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ సహాయకులకు, కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరావు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు అర్హులైన ప్రతి రైతుకు సీసీ, ఆర్‌సీ కార్డులను అందజేయాలని రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ సహాయకులకు సూచించారు. అనంతరం హేమంత్ భరత్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీల్లో పంట నమోదు, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా, తదితర విషయాలను రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. అలాగే మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో కౌలు రైతులకు హక్కు పత్రాలపై అవగాహన కల్పించి పత్రాలను రైతులకు ఇవ్వాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. రెవెన్యూ ఆర్‌ఐ ప్రసాద్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు హాజరయ్యారు.

లింగసముద్రం: అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముత్యాలపాడు, పెదపవని-1 రైతుసేవా కేంద్రాల్లో పంటలసాగు ధ్రువీకరణ హక్కు పత్రంపై మండల వ్యవసాయాధికారి టి.అబ్రహంలింకన్ శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమనిబంధనలకు పాటిస్తూ కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను ఇవ్వడం ద్వారా రైతులు సబ్సిడీలో విత్తనాలు, ఎరువులు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు నష్టపరిహారం జరిగినప్పుడు పరిహారం పొందేందుకు వీలు ఉంటుందన్నారు. ఇ- క్రాప్ నమోదుకు వీలుంటుందని తెలియజేశారు. రెవెన్యూ అధికారులు హనుమల్ల, వినోద్, వ్యవసాయ సహాయకులు ప్రేమ్‌బాబు, నజీర్, రైతులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: కౌలు రైతులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందించాలని తహసీల్దార్ ఎం, డానియేల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతు కార్డులు జారీ చేయడంలో అలసత్వం తగదన్నారు. ఈ కార్డుల కాలపరిమితి 11 నెలలు ఉంటుందని తెలిపారు. కౌలు రైతుకు భూమి యజమాని అగ్రిమెంట్ చేసి ఇవ్వాలని, కౌలు రైతులు సమర్పించే పత్రాలను రెవెన్యూ రికార్డులతో సరిచూసి దరఖాస్తు చేసుకున్న 3 రోజుల్లో జారీ చేయాల్సి ఉంటుందని వివరించారు. కౌలు రైతుకు వేసిన పంటపై మాత్రమే అధికారం ఉంటుందని స్పష్టం చేశారు. మండల వ్యవసాయాధికారి ఎస్. రంగకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, పంటల బీమాకు కౌలు రైతులు అర్హత పొందవచ్చని వివరించారు. కౌలు రైతుకు కూడా బ్యాంక్ రుణలు వచ్చేలా చేయాలన్నారు. తన పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు కౌలు కార్డులు ఉపయోగపడతాయని చెప్పారు.

పీసీపల్లి: మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి కౌలు కార్డులు అందజేయాలని తహసీల్దార్ ప్రభావతి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో గ్రామ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, రెవెన్యూ అధికారులతో కౌలు కార్డులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో దాదాపు 950 మంది కౌలు రైతులున్నారని, వారిలో ప్రతి ఒక్కరికీ కౌలు కార్డులు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటస్వామి, ఏఓ పుల్లయ్య తదితరులున్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్ష


పామూరు: హెల్మెట్ వాడకం ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామానాయక్, పక్కన ఎస్సై


హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై త్యాగ రాజు

కనిగిరి రూరల్: వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించి ప్రాణ రక్షణ పొందాలని ఎస్సై టి. త్యాగరాజు అన్నారు. స్థానిక చెక్ పోస్టు సెంటర్‌లో శుక్రవారం హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అది తలకు రక్షణ కవచంలా పని చేస్తుందన్నారు. హెల్మట్ ధరించనివారికి జరిమానా విధిస్తామని చెప్పారు.

హెల్మెట్ ధరించకుంటే జరిమానా

పామూరు: ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరించకుంటే చర్యలు తీసుకుంటామని సీఐ యం.రామానాయక్ హెచ్చరించారు. మండల కేంద్రమైన పామూరులో శుక్రవారం సాయంత్రం మండల న్యాయ సేవాదికార సంస్థ, స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రామాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై యం.సైదుబాబు, స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, పిడుగు శ్రీనివాసులు, శేషం మోషే, బంకా యేబు, పలువురు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పెంచాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

కందుకూరు: పట్టణంలో జనాభా రోజురోజుకూ పెరుగుతోందని ఆ మేరకు పారిశుద్ధ్య సిబ్బందిని కూడా పెంచాల్సిన అవసరం ఉందని సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు కమిషనర్ కృష్ణారెడ్డికి శుక్రవారం వినతి అందజేశారు. జనాభాతో పాటు నివాస ప్రాంతాల సాంద్రతను బట్టి కార్మికుల సంఖ్యను 150కు పెంచాలన్నారు. అలాగే కార్మికుల మస్టర్ పాయింట్‌ల వద్ద బాత్‌రూం, తాగునీటి వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఆటోలు, ట్రాక్టర్లు వెంటనే మరమ్మతులు చేయించడంతో పాటు, పండుగ సెలవులు, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని కోరారు. ఆరు నెలలకు ఒకసారి అధికారులు, కార్మికులతో సమావేశాలు నిర్వహించి పట్టణ పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో చెల్లించడంతో పాటు, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు ఎస్ఏ గౌస్, సురేస్, ఆనందమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యానికి శిక్ష తప్పదు



మట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పక్కన ఎంపీపీ మూడమంచు

సీఎస్‌పురం (పామూరు): బాధ్యతా రాహిత్యంగా పనిచేసే అధికారులను ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశహాలులో శుక్రవారం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీటీసీ బొమ్మనబోయిన వెంగయ్య, సర్పంచ్ ముప్పాళ్ల శ్యామల, బత్తుల క్రిష్ణకుమారి మాట్లాడుతూ అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. చెన్నపునాయునిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్టిమెంట్‌కింద వేరే పాఠశాలకు కేటాయించారని తక్షణం రద్దు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం మరో ఇద్దరిని త్వరలో వర్క్ అడ్జెస్టిమెంట్ కింద కేటాయించాలని ఎంఈఓలు ప్రసాదరావు, రాజాల కొండారెడ్డిని ఆదేశించారు.సర్పంచ్ శ్రీరామ పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, పీఎస్ రాంప్రసాద్, ఎంపీటీసీలు బైరెడ్డి తిరుపతిరెడ్డి, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీరామ పద్మావతి, ఎంపీటీసీ బత్తుల రమాదేవి, ఎం.వెంకటసుబ్బమ్మ పలు సమస్యలపై ప్రస్తావించారు. ఏఈ మోహన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ హరికృష్ణ, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అఖండ సాయి సప్తాహం నేడు


సాయి బాబా ఆలయం

కనిగిరి రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో శనివారం నుంచి అఖండ సాయి నామ సప్తాహ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమై, 7 రోజులు పాటు జరుగుతాయన్నారు. ఉదయం అఖండ జ్యోతి ప్రజ్వలన, గోపూజ, బాబా వారి ప్రత్యేక పూజలు, పూజా అలంకరణలు జరుగుతాయని తెలిపారు. 8 గంటలకు పట్టణ పుర వీధుల్లో బాబా వారి 'భిక్ష' కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: మండల పరిధి వేముల పాడు ఘాట్ రోడ్డులోని మలుపు వద్ద శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఎలికవారిపల్లి గ్రామానికి చెందిన వంట్రా బాలయ్య, వెలిగండ్ల మండలం ముసిలిపల్లికి చెందిన వంట్రా చిన్న సుబ్బయ్య, వెలిగండ్ల మండలం ముసిలిపల్లికి చెందిన వంట్రా ఆదేయ్యలు ఎర్రగొండపాలెం బంధువుల వద్దకు వెళ్లి తిరిగి ముగ్గురు ద్విచక్ర వాహనంపై స్వగ్రామాలకు వస్తున్నారు. వేములపాడు ఘాట్ రోడ్డు మలుపు వద్ద పొదిలి వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారును తప్పించ బోయి ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వంట్రా బాలయ్య, వంట్రా ఆదెయ్య, వంట్రా చిన్న సుబ్బయ్యలకు కాళ్లకు చేతులకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా కనిగిరి తరలరించారు.

నేటి నుంచి పోలేరమ్మ తిరునాళ్ల

కనిగిరి రూరల్: పట్టణంలోని కొత్తూరులో శ్రీ పొలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం శని, ఆదివారం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు పెద్దమ్మ గుడిలో పొంగళ్లు, అనంతరం చల్ల కడువ ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు కలశ ఊరేగింపు జరుగుతుంది. ఆదివారం పొంగళ్లు, ట్రాక్టర్ బండ్లతో ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి


ఉలవపాడు జూనియర్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ పై అవగాహన

ఉలవపాడు: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపీ చంద్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌ను మంచిగా చేసుకోవాలంటే క్రమశిక్షణ చాలా ముఖ్యం అన్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని, కష్ట పడి చదవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన


ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని సతుకుపాడు ఇసుక స్టాక్ పాయింట్‌ను శుక్రవారం తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి పరిశీలించారు. ఇసుక పంపిణీ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీరియల్ ప్రకారం ట్రాక్టర్లకు లోడ్ చేయాలని సూచించారు. ట్రాక్టర్‌కు 1,360 రూపాయలు వసూలు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఆర్‌ఐ రమణయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.